❖•❖•❖ 40 ❖•❖•❖

# యేసు అపహసింపబడెను

*"ఆయన యెదుట మోకాళ్లూని ... ఆయనను అపహసించిరి" (మత్తయి 27:29).*

యేసు సిలువవేయబడుటకు సంబంధించిన నాలుగు గాథలలోను, మనము "అది నిజముగా సాధ్యమా" అని పరిగణించుటకైనా వీలులేని విషయాలను గమనిస్తాము! మానవుడు, సృష్టి, వారి సృష్టికర్తను, దేవుని కుమారుని, చూస్తూ కపట పరిహాసముతో నవ్వుచుండుటను మనము చూస్తాము! "న్యాయబుద్ధిగల ఆలోచన మరియు అభిప్రాయము గలిగిన వాడెవడైనా ఇటువంటి అమానుషమైన కృత్యమును చేస్తాడా?" అని మనము ప్రశ్నించుకొంటాము.

వాక్యభాగము స్పష్టంగా ఉన్నది: మానవుడు యేసును సిలువవేయుట మాత్రమే గాక, ద్వేషపూరితమైన అపహాస్యముతో కూడా ఆయనను నిశితంగా దుయ్యబట్టాడు! వాని పాపమునుబట్టి వానికి విధించబడు నిత్య శిక్ష నుండి వానిని రక్షించుటకు త్వరలోనే మేకులతో సిలువకు కొట్టబడనై యుండిన చేతులను నవ్వులాటగా ఎక్కిరించుచు ఎగతాళి చేశాడు. వాడు యేసు ముఖముపై, వాని కొరకు అతి గొప్ప ప్రేమను ప్రతిబింబించిన ముఖముపై, వాని కొరకు అతి గొప్ప ప్రేమను ప్రతిబింబించిన ముఖముపై ఉమ్మివేశాడు మరియు చెంపదెబ్బ కొట్టాడు.

యేసు పిడిగుద్దులు తిన్నాడు, కళ్లకు గంతలు కట్టబడ్డాడు, ఎత్తిపొడుపు మాటలు (తి) విన్నాడు, రాజదండమువంటి మొరటు రూపమైన రెల్లుతో కొట్టబడ్డాడు. నిర్దాక్షిణ్యంగా ద్వేషపూరితమైన తిరస్కారము రక్షకునిపై ఏకధాటిగా కుమ్మరింపబడింది! ఆయన శరీరంతో మృగప్రాయలుగా వ్యవహరించుటకు అంతా సిద్ధం చేయబడుచుండగా, ఆయన గూర్చి బాధ్యత వహించినవారు ఆయన స్ఫూర్తిని భయపెట్టాలని చూశారు. ఆయన వ్యక్తిత్వము, హోదా, స్వభావము, మరియు ఉద్దేశము వెటకారంగా వెక్కిరింపబడ్డాయి. ఎవరినైతే రక్షించుటకు ఆయన మరణించనైయుండెనో వారు ఆయన దైవీకమైన ఉద్దేశములను, ఆయన పరిశుద్ధ బలియాగమును, మరియు పరోపకారబుద్ధితో కూడిన ఆయన నిస్వార్థ ప్రేమను అవమానపర్చారు.

*"యూదుల రాజా, నీకు శుభము!" అని పలుకుచూ, వారు ఆయన రాజత్వమును అపహసించారు.* రోమా ప్రభుత్వ తీర్పు తీర్చబడుచుండిన సమయంలో పిలాతు, ఎవరిని విడుదల చేయవలెనని వారు కోరుకొందురో ఎంపిక చేసికొనవచ్చునని కూడుకొని యుండిన జనసమూహము యెదుట ఆయన బరబ్బను మరియు యేసును ఉంచాడు. అప్పుడు వారు పిచ్చి ఆవేశంతో కేకలు వేస్తూ, "మాకు బరబ్బను విడుదల చేయుము" అని ఏక కంఠంతో అరిచారు (లూకా 23:18). యేసు ఒక నేరస్థుడు, ఒక తిరుగుబాటుదారుడు, ఒక నరహంతకుని కంటె ఘోరాతిఘోరమైన నేరస్థుడని వారి ఎంపిక ఘోషించింది.

తీర్పు తరువాత సంభవిల్లిన సన్నివేశము, పిలాతు తన తుది నిర్ణయమును ప్రకటించిన తరువాత, పరలోకము శోకించునట్లును భూమి వణకునట్లును చేసియుండును. ఈ హృదయవిదారకమైన వివరములను మత్తయి విశదీకరించాడు:

ముండ్ల కిరీటమును అల్లి ఆయన తలకు పెట్టి, ఒక రెల్లు ఆయన కుడి చేతిలో నుంచి, ఆయన యెదుట మోకాళ్లూని – "యూదుల రాజా, నీకు శుభమని" ఆయనను అపహసించి ఆయన మీద ఉమ్మివేసి, ఆ రెల్లును తీసికొని దానితో ఆయనను తనమీద కొట్టిరి (మత్తయి 27:29, 30).

సిలువ యొద్ద ప్రధాన యాజకులు, ప్రజల పెద్దలు, మరియు శాస్త్రులు – అందరు – కలిసి యేసును అపహసించారు. వారు, "ఇశ్రాయేలు రాజుగదా, యిప్పుడు సిలువమీద నుండి దిగినయెడల వాని నమ్ముదుము" అని పలికారు (మత్తయి 27:42బి).

*"తనను తానే రక్షించుకొననిమ్ము" అని పలుకుచూ, వారు ఆయన శక్తిని అపహసించారు.* యేసు ఇహలోక పరిచర్య సమయంలో, ఆయన ఆశ్చర్యకరమైన తన శక్తిని బహిరంగముగా ప్రదర్శించాడు. ప్రజలు దానిని చూశారు, అంగీకరించారు, మరియు దాని అంతర్భావములను గ్రహించారు. యూదుల అధికారి, నీకొదేము సహితము "బోధకుడా, నీవు దేవునియొద్దనుండి వచ్చిన బోధకుడవని మేమెరుగుదుము: దేవుడతనికి తోడైయుంటేనే గాని నీవు చేయుచున్న సూచక క్రియలను ఎవడును చేయలేడని" యేసుతో చెప్పాడు (యోహాను 3:2). యేసు చేసిన అద్భుతములు స్వయంవిదితమైనవిగాను, విశ్వసనీయమైనవిగాను, పొరబడరానివిగాను ఉండెను. వాటి సిసలైన ప్రామాణికతను ఆయన శత్రువులు సహితము అంగీకరించారు.

ఆయన పరిచర్య గూర్చి ప్రదర్శింపబడిన ఈ సత్యమును ప్రక్కకు నెట్టివేస్తూ, వినోదములను చూడవచ్చి సిలువకు సమీపంలో చేరుకొన్న సందర్శకులు వారి తలలూచుచూ, "దేవాలయమును పడగొట్టి మూడు దినములలో కట్టువాడా, నిన్ను నీవే రక్షించుకొనుము! నీవు దేవుని కుమారుడవైతే సిలువమీదనుండి దిగుము" అని చెప్పుచు ఆయనను అపహసించారు (మత్తయి 27:40). యూదుల అధికారులు ఈ తిరస్కారములో చేరి, "వీడు ఇతరులను రక్షించెను; వీడు దేవుడేర్పరచుకొనిన క్రీస్తు అయినయెడల తన్ను తాను రక్షించుకొనునని" అపహసించారు (లూకా 23:35). సైనికులు సహితము వారి గొంతులు తెరచి శ్రమ నొందుచుండిన క్రీస్తును అపహసించారు. వారు ఆయనను సమీపించి, "నీవు యూదుల రాజువైతే నిన్ను నీవే రక్షించుకొనుమని" ఆయనను అపహసించారు (లూకా 23:37).

యెరూషలేము పట్టణములో నుండినవారిలో, సిలువవేయబడుటకు యేసు తనను తాను అప్పగించుకొనుచుండిన దానికి గల కారణమును గ్రహించిన వారిలో, బహుశ ఆయన అపొస్తలులు, శిష్యులు, మరియు ఇతరులు కొందరు మాత్రమే ఉండియుంటారు. అధికారులు, వారి అజ్ఞానము వలన, ఆయన సిలువ మీదినుండి దిగి రావలెనని కేకలు వేశారు. ఆయన తనను తాను రక్షించుకొనవలెనని వారు పలుకుచుండిన ఎత్తిపొడుపులతో కూడిన సవాలు సిలువ సమీపమున వారికిష్టమైన వెక్కిరింపు కూతయై యుండినది. "ఆలాగే శాస్త్రులును పెద్దలును ప్రధానయాజకులును కూడ ఆయనను అపహసించుచు – 'వీడు ఇతరులను రక్షించెను, తన్నుతానే రక్షించుకొనలేడు' " అని అపహసించారని మత్తయి చెప్పుచున్నాడు (మత్తయి 27:41, 42ఎ). యేసు తనను తానే రక్షించుకొన్నట్లయితే మానవ జాతికి రక్షణ లేదని వారు గ్రహించలేదు.

*" 'నేను దేవుని కుమారుడను' అని ఆయన చెప్పాడు" అని పలుకుచూ, వారు ఆయన దైవత్వమును అపహసించారు.* "నీవు దేవుని కుమారుడవైన క్రీస్తువైతే, ఆ మాట మాతో చెప్పుము" అని కయప యేసుకు ఆజ్ఞాపించాడు (మత్తయి 26:63బి). అందుకు

యేసు, “నీవన్నట్టే” అని సమాధానమిచ్చాడు (మత్తయి 26:63బి). ఆయన దేవుని కుమారుడైయున్నాడను సత్యమును స్వాధికారముతో చెప్పుట మాత్రమే కాదు గాని ఆయన ఆ సత్యమును తన పరిచర్య యందంతటను సంపూర్ణంగా ప్రదర్శించాడు. ఈ ధ్రువీకరణమునకు కయప ఎలా ప్రతిస్పందించాడు? ఆయన ప్రతిస్పందనను చదువండి అప్పుడు మానవులు దేవుని కుమారునితో ఇంత ఘోరంగా వ్యవహరిస్తారా అని మీ ముఖాలు సిగ్గుతోను అవమానంతోను ఎఱ్ఱబడుతాయి:

> “ప్రధానయాజకుడు తన వస్త్రము చింపుకొని – “వీడు దేవదూషణ చేసెను! మనకిక సాక్షులతో పని ఏమి? ఇదిగో ఈ దూషణ మీరిప్పుడు విన్నారు; మీకేమి తోచుచున్నది?” అని అడిగెను. అందుకు వారు, “వీడు మరణమునకు పాత్రుడు” అనిరి. అప్పుడు వారు ఆయన ముఖముమీద ఉమ్మివేసి, ఆయనను గుద్దిరి; కొందరు ఆయనను అరచేతులతో కొట్టి – “క్రీస్తూ, నిన్ను కొట్టినవాడెవడో ప్రవచింపుము” అనిరి (మత్తయి 26:65-68).

యేసు ఆయన దైవత్వము గూర్చి సాక్ష్యమిచ్చినందువలన ఆయన దేవదూషణ చేశాడని మతాధికారులు మరియు శాస్త్రులు ఆయన మీద నేరము మోపారు. మత సంబంధికులు, వారు మెస్సీయా కొరకు, దేవుని కుమరుని కొరకు ఎదురుచూచుచున్నారని బహిరంగంగా నిశ్చయంతో ప్రకటించినవారే, యేసును సిలువ వేశారని మనము గ్రహించినప్పుడు మన హృదయాలు బ్రద్దలైపోతాయి! అయన తన స్వకీయులయొద్దకు వచ్చెను; ఆయన స్వకీయులు ఆయనను అంగీకరింపలేదు (యోహాను 1:11).

*వారు దేవునియందు విశ్వాసముంచెను అని పలుకుచూ వారు ఆయన నైతిక న్యాయవర్తనను అపహసించారు.* సిలువ యొద్ద ఈ మతాధికారులు ఆయనను ఎత్తిపొడుపు మాటలతో ఎగతాళి చేశారు. కొందరు, “వాడు దేవునియందు విశ్వాసముంచెను; ‘నేను దేవుని కుమారుడనని’ చెప్పెను, గనుక ఆయనకిష్టుడైతే ఆయన ఇప్పుడు వానిని తప్పించుననిరి” (మత్తయి 27:43).

యేసు మానవుని చేత మాత్రమే కాదు గాని దేవుని చేత కూడ తిరస్కరింపబడ్డాడని అక్కడ సిలువ యొద్ద ఉండినవారిలో అనేకులు ప్రకటించారు. ఆయన పాపము ఆయనను కనుగొన్నదని వారు వాదోపవాదములు చేశారు. “నేడు, దేవునితో కూడ నడుచువాడై యున్నాడు. దేవుడెందుకు ఆయనను సిలువమీదనుండి క్రిందికి దింపడములేదు? వీడు నమ్ముకొన్న దేవుడు కూడా ఇప్పుడు వీనిని విడిచిపెట్టాడని మనము చూచుటలేదా?” అని వారనుకొన్నట్టుగానే అన్నారు.

ఔను, యేసు అపహసింపబడ్డాడు! ఆయన రాజత్వము, శక్తి, దైవత్వము, మరియు నైతిక న్యాయవర్తనము సహితము హేళనచేయబడ్డాయి! మనము ఈ వాస్తవమును కొంచెము మననం చేద్దాము. ఏదిఏమైనా, మనము దానిని వ్యక్తిగతంగా వర్తించుకొనకుండా క్రీస్తు అపహసింపబడుటను మనము విడిచిపెట్టకూడదు. దుఃఖముతో మన తలలు మాత్రమేగాక మన హృదయములను సహితము ఆయన యెదుట వంచుచు, “యేసు ఎదుర్కొన్న అపహాస్యము నుండి మనము ఏమి నేర్చుకొనుచున్నాము?” అని మనలను మనము ప్రశ్నించుకొందాము.

*మొదటిగా, అపహాస్యము క్రూరమైనదనియు అవి మనస్సును గాయపర్చే మాటలనియు మనము గమనించుచున్నాము.* వీరు యేసు మనస్సును గాయపర్చాలని ఆశించారు, వారనుకున్న ప్రకారమే చేశారు కూడ. యేసు దానిని ఎంతో మహనీయంగా సమాళించాడు;

కానీ ఆయన చేతుల్లోను కాళ్లలోను దిగగొట్టబడిన మేకులు గాయపర్చినట్లుగానే అది ఆయన మనస్సును గాయపర్చింది. ఇతరులను అపహసించుట అంటే వారి మనస్సును బుద్ధిపూర్వకంగా గాయపర్చడమన్నట్లే.

*రెండవదిగా, అపహాస్యము ఒక దుష్ట సాధనమని మనము చూచుచున్నాము.* యేసు మీద క్రుమ్మరింపబడిన అపహాస్యము ఒక నీతిబాహ్యమైనదియు నికృష్టమైనదియునైన లక్ష్యమును నెరవేర్చింది. అది నిజమైన క్రీస్తును అబద్ధమైన క్రీస్తుగా చేయుటకే ఉద్దేశింపబడింది. యూదులు దేవుడు పంపిన క్రీస్తును కోరలేదు. ఆయన వారి ఊహాగానాలకు సరిపడలేదు. నిజమైన క్రీస్తు వారి ప్రణాళికలకు అనుగుణంగా లేడు. కాబట్టి వారు ఆయనను సిలువవేసి కూడ వారి మనస్సాక్షులతో జీవించగలుగునట్లు, వారు ఆయనను కనీసము వారి మనస్సుల్లోనైనా మార్చవలసిన అవసరత వారికేర్పడింది. సిలువమరణము నేరస్థుల కొరకును ఘోరాతిఘోరమైన వారి నిమిత్తమును ఉద్దేశింపబడింది, కానీ యేసు ఈ రెండింటిలో ఏదీ కాదు. ఆయన దేవుని పరిపూర్ణమైన కుమారుడై యుండెను. వారు ఆయనతో ఏంచేయగలిగియుండిరి? వారు ఆయన శీలమును అపఖ్యాతిపాలుజేసి ఆయనను తుచ్ఛమైన మహానుభావునిగా కించపర్చారు. యేసు సిలువమరణమునొందుట ఎంతో భయంకరమైన కార్యమై యుండినది కానీ వారు అది అలా అట్లగుపించకుండునట్లు తగు జాగ్రత్త వహించారు. వారు ఈ లోకములో నుండి ఒక దుర్మార్గున్ని తొలగించుచున్నారని చెప్పుకొంటూ తద్వారా వారు చేయుచుండినదానికి గౌరవమును ఆపాదిస్తూ ఈ సమాజానికే సదుపాయమైన ఒక సేవయై యున్నదను అభిప్రాయమును ప్రజల మనస్సుల్లో పుట్టించుటకు ప్రయత్నించారు.

*మూడవదిగా, అపహాస్యము అసూయలో నుండి అవతరించునని మనము చూచుచున్నాము.* "వారు అసూయచేత ఆయనను అప్పగించిరని" మనకు చెప్పబడుచున్నది (మత్తయి 27:18). అసూయ అది కూడా ఆకుపచ్చగా నున్నట్లు అగుపిస్తూ దాని దగ్గరకు వచ్చు ఎరను భక్షించు ఆకుపచ్చని కళ్లు కలిగిన జాతికి చెందిన ఒక భయంకరమైన జంతువువలె చిత్రీకరింపబడి యున్నది. అసూయ అనునది అది పోయబడు ఒక వస్తువు యొక్క పైభాగము మీద కంటె అది నిలువ ఉన్న పాత్ర లోపలి భాగంలోనే ఎక్కువ హాని కలుగజేస్తుందని చెప్పబడింది. మనిషిలో మంచిని మరియు పవిత్రమునైన శీలమును పెంపొందించుటకు బదులుగా ఈర్ష్య మరియు అసూయ ఇటువంటి మంచి గుణలక్షణములను క్షీణింపజేస్తాయి. అవి వీటిని కాపాడి ప్రతిరక్షించవు; వాటిని నాశనము చేస్తాయి.

*ఇప్పుడు, అపహాస్యముతో ఎలా వ్యవహరించాలో చూద్దాము. యేసు దానిని దేవునికే అప్పజెప్పాడు.* "ఆయన దూషింపబడియు బదులు దూషింపలేదు; ఆయన శ్రమపెట్టబడియు బెదిరింపక, న్యాయముగా తీర్పు తీర్చు దేవునికి తన్ను తాను అప్పగించుకొనెను" అని పేతురు వ్రాస్తున్నాడు (1 పేతురు 2:23). యేసును అపహసించినవారు ఆయనను నాశనము చేయలేకపోయారు. దానికి బదులుగా, నల్లని లేక చీకటిగా నున్న దాని నేపథ్యంలో ఒక వజ్రము ఎలా కాంతివంతముగా ప్రకాశిస్తుందో అలాగే, యేసు శీలము కళ్లకద్దినట్లు ప్రత్యక్షంగా కనబడింది. వారు యేసు యెడల చేయుచుండిన పరిహాసమును ఆయనపట్ల పలుకుచుండిన చురుకుమనే మాటలను మనము గమనించినట్లయితే, మానవ హృదయాలు చేయగల అత్యంత అజ్ఞానాంధకారమైనవియు అవినీతిమయమునైన ఆలోచనల వెనుక నున్న

దైవత్వమును మరియు పరిపూర్ణమైన పరిశుద్ధతను మనము స్పష్టంగా చూడగలము.

ఐదవదిగా, ఆయన మన నిమిత్తము చేసిన పాపప్రాయశ్చిత్తార్థ బలియాగమును అలక్ష్యము చేయుట ఆయన సిలువ మరణము నొందుచుండిన సమయంలో ఎదుర్కొన్న అపహాస్యము ఆయన మనస్సును గాయపర్చినంతగా గాయపర్చునని మనము గమనించవలెను.

> యేసు గొల్గొతాకు వచ్చినప్పుడు వారాయనను మ్రానుపై వ్రేలాడ దీసిరి,
> కలువరి గోరిపై ఆయన హస్తములు పాదములలోను మేకులు దిగగొట్టిరి;
> ముండ్ల మకుటమొకటి ధరింపజేసిరి, ఎఱ్ఱనివియు లోతైనవియునైన గాయములు చేసిరి,
> రోజులు అనాగరికమును క్రూరమునైయుండెను, మానవ మాంసము చవుకయై
> యుండెను.
>
> యేసు [మా][1] కొరకు వచ్చాడు మేమాయనను దాటిపోతిమి,
> తలవెంట్రుకకైనను హాని చేయలేదు, మరణించునట్లు అనుమతించితిమి;
> మానవులు మరింత మృదువై, ఆయనను బాధపెట్టలేదు,
> వీధీ గుండా వెళ్లిపోయాము, ఆయనను వర్షములోనే వదిలిపెట్టాము.
>
> "వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుమని" ఆయన కేకవేసెను,
> చల్లని వర్షం కురుస్తూనే ఆయనను తడిపి ముద్దచేసింది;
> ఇళ్ళకు వెళ్లిపోయిన ప్రజ వీధులను నిర్మానుష్యము చేసింది,
> యేసు గోడకు ఒరిగి కలువరి గిరి కోసము కన్నీరు కార్చెను.[2]

యేసు, దేవుని కుమారుడు, ఈ లోకానికి వచ్చాడు. తన స్వకీయులు ఆయనను తృణీకరించుట మాత్రమేగాక, ఆయనను అపహాస్యము కూడా చేయుచు ఆయనను సిలువవేశారు.

❖◆❖◆❖

*యేసును అపహసించుట గూర్చి మనము కలలోనైనా ఊహించుకొనలేము; కానీ మనము అలక్ష్యము చేయమని కూడ రూఢిపర్చుకొందాము. అలాగైతే యేసును మనమేంచేద్దాము? నిజ క్రైస్తవుడు నోరు తెరచి సమస్త లోకము వినునట్లు, "ఆయన దేవుని కుమారుడు, ఆయనను ఘనపరచుము!" అని కేకలు వేస్తాడు.*

---

సూచనలు

[1]ఈ పాఠమును అన్వయించుకొనుటకు మీ సమాజము యొక్క పేరును పెట్టవచ్చును. [2]Adapted from Geoffrey Anketell Studdert Kennedy, "Indifference," *The Unutterable Beauty: The Collected Poetry of G. A. Studdert Kennedy* (London: Hodder and Stoughton, 1927), 24.